రాత్రి బస్టాండ్‌కి వచ్చి భీమవరం వెళ్ళే బస్ ఎక్కి కూర్చున్నాను.

మనసు పరిపరివిధాల పోతూ వికలంగా వుంది.

అయిదు నిముషాల తర్వాత ఎవరో ముసలాయన వచ్చి నా పక్క సీట్లో కూర్చున్నాడు. కొద్దిగా ఆయాసపడుతున్నాడు. ఈ వయసులో చివరి గమ్యం దాకా ప్రయాణించగలడో, లేక మధ్యలో గుటుక్కుమంటాడో...తన పక్క సీటే ఈయనకి రావాలా? ఈయన్ని చూస్తే మా నాన్న గుర్తొచ్చి ఓ మూల జాలేస్తోంది. కానీ అసలే చిరాగ్గా వున్న నా మనసుకు ఇది ప్లస్సయింది.

కథ

ప్రతాప వెంకట సుబ్బారాయుడు

# కౌన్సిలింగ్



"బాబూ, నేను మంచి నీళ్లు తెచ్చుకోవడం మరచిపోయాను. కాస్త ఇవ్వవూ, టాబ్లెట్ వేసుకోవాలి" అభ్యర్థించాడు.

"మందులు వేసుకోవాలని తెలిసినవాళ్లు మంచినీళ్లు తెచ్చుకోవడం ఎలా మరచిపోతారో" మనసులో విసుక్కుంటూ బాటిల్ ఇచ్చాను.

ఆయన టాబ్లెట్ వేసుకున్నాడు.

డ్రైవర్ వచ్చి కూర్చుని బస్ స్టార్ట్ చేశాడు. రెండు నిముషాల్లో బయల్దేరింది.

కిటికీలోంచి చల్లటి గాలి వీస్తూ మనసుని ఆహ్లాదపరుస్తోంది.

నా పక్కాయన నిద్రలోకి జారుకున్నాడు. "భగవంతుడా! అది శాశ్వత నిద్ర కాకుండా చూడు" మనసులో అనుకున్నాను.

బస్ వేగంతో పాటు నా ఆలోచనలు క్రమాకృతి దాల్చి మనసులో సినిమాలా కదులుతున్నాయి.

* * *

పల్లెటూళ్లో మధురానుభూతుల మధ్య పెరిగినా, దూరపుకొండలు నునుపు కాబట్టీ పట్నవాసపు సొగసులు, అక్కడి విలాసవంతమైన జీవితాలూ నన్ను ఎప్పుడూ ఆకర్షిస్తుండేవి.

బాగా సంపాదించాలి...సిటీలో సెటిలవ్వాలి...ఇవే ధ్యేయంగా పెట్టుకుని కష్టపడి చదువుకున్నాను. మా నాన్న మొక్కకు కావల్సిన ఎరువు, నీళ్లు సకాలంలో పోసి సంరక్షించినట్టుగా నా చదువుకు కావలసిన వనరులు శ్రద్ధగా సమకూర్చేవాడు. అందువల్ల నా చదువు నల్లేరు మీద బండి నడకలా ఎటువంటి ఒడిదుడుకులూ లేకుండా సాఫీగా సాగి నా చేతిలో సర్టిఫికేట్ పెట్టింది.

అప్పట్లో అన్ని రంగాల్లోకి తారజువ్వలా దూసుకెళుతున్న సాఫ్ట్‌వేర్ రంగంలో అదృష్టవశాత్తు కాలు పెట్టగలిగాను.

పని...డబ్బు...జల్సా...వీటితోటే నా జీవితం ముడిపడిపోయింది.

రాత్రి పగలు ఒకటే పని. చిన్న వయసులోనే బిపి వచ్చేసింది. పని ఒత్తిడితో, నిద్ర సరిగా

లేక టాబ్లెట్లు ఖచ్చితంగా వేసుకోవలసిన కొన్ని వ్యాధులు నా శరీరాన్ని ఆశ్రయించాయి. సంస్థ ఇచ్చిన ఫెసిలిటీస్...అందుకునే శాలరీ ముందు నాకు అవేం పెద్ద ఇబ్బందులనిపించలేదు.

అప్పుడప్పుడు మా ఊరెళ్లినప్పుడు నాన్న మాత్రం "నీ శరీరంలో అసహజ మార్పులు కనిపిస్తున్నాయి. జాగ్రత్తగా ఉండు. ఆరోగ్యమే మహాభాగ్యం. జీవించినంత కాలం ఆహ్లాదంగా, ఆనందంగా జీవించాలి. మనకు దొరికిన ఈ మానవ జన్మ అద్భుతమైంది. దాన్ని అనుభూతించాలి, అంతేకాని మరబొమ్మలా మారకూడదు" అని సున్నితంగా హెచ్చరించేవాడు.

మంచి మాటలు తలకెక్కించుకునే వయసా అది...నవ్వి ఊరుకునేవాడిని.

రెండేళ్ల తర్వాత నా టీమ్‌మేట్‌గా జూనియర్ పొజిషన్‌లో చేరింది స్వప్న. చాలా చలాకీగా ఉండేది. సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్స్ రాయడంతో తనదైన స్టైల్ కనబరిచేది. తను రాసిన ప్రోగ్రామ్స్‌లో బగ్స్ ఉండేవి కావు. ఎగ్జాక్ట్ అవుట్‌పుట్ వచ్చేసేది. క్లయింట్స్ చాలా హ్యాపీగా ఉండేవారు.

అప్పటిదాక పని తప్ప మరో ప్రపంచం తెలియని నన్ను, తనవైపు తన ఆకర్షణ శక్తితో బలంగా తిప్పేసుకుంది.

ఇప్పుడు తనే ఒక ప్రపంచమైపోయింది నాకు.

తననే గమనించడం, పనిలో మెళకువలు నేర్పడం, లంచ్‌ని షేర్ చేయడం, నా బైక్ మీద డ్రాప్ చేయడం లాంటివి అత్యంత ఇష్టంతో చేస్తున్నాను.

ఒకనాటి సాయంత్రం టాస్క్ సక్సెస్ అయిన నేపథ్యంలో మంచి ఖరీదైన హోటల్లో క్యాండిల్ లైట్ డిన్నర్ ఆఫర్ చేశాను.

ఆ రాత్రి రిజర్వ్ చేసిన టేబుల్ దగ్గర ఎదురెదురుగా కూర్చున్నాక, మెల్లగా ఆఫీసు విషయాల్లోంచి టాపిక్‌ని డైవర్ట్ చేసి ఆమెకు ప్రపోజ్ చేశాను. ఆమె బెట్టు చేయడం కానీ, సున్నితంగా తిరస్కరించడం కానీ చేయలేదు. సింపుల్‌గా ఒప్పేసుకుంది.

మామూలు మనిషి ఏనుగు అంబారి ఎక్కేది బహుశా ఇలాంటి సందర్భంలోనే అనుకుంటా. మనసు దూది పింజ అయింది.

"మనిద్దరం యంగ్. బోలెడంత ఫ్యూచర్ వుంది...మీరూ హేండ్‌సమ్‌గా, చురుకుగా ఉంటారు. హెల్పింగ్ నేచర్ వుంది. మన మారీడ్ లైఫ్ హేపీగా సాగిపోతుందని నాకు నమ్మకం ఉంది. మా నాన్న ఒంగోలులో ఓ చిన్న కౌలు రైతు. తనది రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితైనా, చదువులో చురుకైనదాన్నవడంవల్ల నా చదువుకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూసుకున్నారు. నేనిక్కడే వర్కింగ్ విమెన్స్ హాస్టల్లో వుంటున్నాను. మా వాళ్లు నా మాట కాదనరు. మా కుటుంబ పరిస్థితులు మీకు అభ్యంతరం కాకపోతే, మన విషయం మా వాళ్లతో చెప్పి, మా నాన్నగారిని...మీ వాళ్లని కలవమని చెబుతాను" అంది.

నేను సమ్మతమే అన్నట్టుగా ఆమె చేతిని అందుకుని సన్నగా నొక్కాను.

సంతోషంగా సెల్ ఫోన్లో మా వాళ్లకు విషయం చెప్పాను. మొదట్నుంచి వాళ్లు నన్ను స్వేచ్ఛగా పెంచారు. మనసులో ఏదీ దాచుకోవడం మాకు ఇష్టముండదు. అందుచేత నా నిర్ణయానికి అమ్మానాన్నలు కూడా ఏమీ అభ్యంతరం చెప్పలేదు.

అనుకున్నట్టుగానే ఆమె తల్లిదండ్రులు మా వాళ్లని కలిసారు.

తర్వాత వచ్చిన మంచిరోజులు మా ఇద్దర్నీ ఒక్కటి చేశాయి.

లక్షల్లో హోమ్‌లోన్ తీసుకుని మాదాపూర్లో ఫ్లాట్ తీసుకున్నాము.

మాదైన చిన్న ప్రపంచం ఏర్పడిపోయింది. కొంతకాలానికి మరో ఇద్దరు బుజ్జి అతిథులు వచ్చారు. కాలం కమ్మగా పీచు మిఠాయిలా కరిగిపోతోంది.

పెన్నులో ఇంక్ బదులు మధురం నింపి డైరీల్లో పేజీలు నింపుకుంటున్నాం.

డబ్బుని వెదజల్లి...సుఖాలను సొంతం చేసుకుంటూ, జీవితం నల్లేరు మీద బండి నడకలా సాగిపోతున్నప్పుడు ఒక చిన్న జర్క్.

రిసెషన్...!

శిశిరంలో వృక్షాలు ఆకులు రాల్చేసినట్టు టపటపమని సాఫ్ట్‌వేర్ సంస్థలు ఉద్యోగులను తొలగించేశాయి.

స్వప్న ఉద్యోగం పోయింది.

ఇంకోటి దొరుకుతుందన్న ఆశ కూడా లేదు. ఎందుకంటే అవకాశాలు లేవు. ఉన్నా ఎనార్మస్ స్కిల్స్‌తో ఎక్విప్ అయి వున్న తన తోటివాళ్లతోటే తనకు పోటీ. పోనీ మేమేమన్నా చిన్న ఉద్యోగులమా? ఏదో ఒక పని చెయ్యడానికి. ఏసీలకీ, ఫెసిలిటీస్‌కి, క్యాబ్‌లకీ అలవాటు పడిన జీవితాలు మావి. గట్టిగా ఎండలో నాలుగడుగులు వేయలేం. మానసిక క్షోభ. అనుక్షణం రంపపు కోత.

రెండు జీతాలకు అలవాటు పడిన మా ఇంటికి ఇది అశనిపాతం. ఇంటి లోన్‌కు దాదాపు ఒక జీతం వెళ్లిపోతుంది. అలాంటిది ఒక్క జీతంలో అన్నీ ఎలా? ఎలా?? పోనీ దీపం ఉండగానే ఇల్లు చక్క బెట్టుకోవడం కోసం ఏవైనా పొదుపు చేసి కూడబెట్టామా? అంటే, అదీలేదు. అసలు రేపటి గురించి ఆలోచన ఉంటేగా!

భవిష్యత్తు కూడా వర్తమానం లానే బంగారంలా ఉంటుందనుకున్న మా ఆశలు అలా ఆవిరయ్యాయి.

నిన్నటిదాకా మాల్స్, మల్టీప్లెక్స్‌ల్లో గీక్కోమని క్రెడిట్ కార్డులు నిర్లక్ష్యంగా విసిరేసిన మేము, సరుకులకోసం మార్వాడీ షాపులకు వెళ్లగలమా? అసలు అంత ఛేంజ్‌ని మనసు డైజెస్ట్ చేసుకోగలుగుతుందా?

మా సంస్థలో కూడా మ్యాన్ పవర్ రిడక్షన్ మొదలైంది. "భగవంతుడా నాపేరు ఆ లిస్ట్‌లో ఉండకుండా చేయి" మనసులో వేలసార్లు మౌన ప్రార్థనలు.

నిజం చెప్పాలంటే బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నాం.

ఒక నెల భారంగా గడిచింది.

అనుకున్నంతా అయింది.

నేనెళ్లేసరికి హెచ్ఆర్ నుంచి వచ్చిన లెటర్ నా కోసం ఎదురుచూస్తోంది.

మెదడు శూన్యమయిపోయింది.

రేపటి నుంచీ ఎలా?ఎలా?

శరీరం నుంచి రక్తం పీల్చేసినట్టు అడుగులు తడబడుతూ ఇంటికి చేరాను.

తలుపు తీసిన స్వప్న నేను విషయం చెప్పకుండానే గ్రహించింది.

ఇద్దరి మనసుల్లో రేపెలా? అన్నదే దొలిచేస్తున్న ప్రశ్న.

ఆ రాత్రి మేము నిద్రపోకుండానే తెల్లా

**శ్రీమతి తురగా జానకీరాణి మేలిమి కథల పోటీలో**
**సాధారణ ప్రచురణకు ఎంపిక చేసిన కథ**

రింది.

నిన్నటిదాకా తెల్లారుతోందంటే ఎంతో ఉత్సాహంగా ఉండేది? కొత్త టాస్క్‌లు అలాట్ చేయబడతాయని, వాటిలో మన పెర్ఫార్మెన్స్‌కు తగిన షేర్ ఉంటుందనీ.

కానీ ఇప్పుడు రోజులు అతి భయానకంగా, భారంగా గడుస్తున్నాయి. తెల్లారితే సమస్యలు పలకరిస్తాయి కాబట్టి, తెల్లవారకూడదనిపిస్తోంది.

మా సంగతి సరే, పిల్లలు ఎలా? వాళ్లని పోషించడమూ కష్టమే! మా పెద్దవాళ్ల దగ్గర వదులుదామంటే, ఇన్నాళ్లూ మా సంతోషం మాదే గానీ వాళ్లని పట్టించుకున్నది లేదు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని వెళ్లగలం? ముఖ్యంగా మా అమ్మానాన్నలు. వాళ్లని చూసి చాలా కాలమయింది. మా అమ్మ ఫోన్ చేసి నన్ను చూడాలని విలవిల్లాడిపోయేది. తీరికుంటేగా! వీకెండ్స్ మా ఎంజాయ్మెంట్‌కే సరిపోయేది కాదు.

మా నాన్నతో, అమ్మని తీసుకుని మా ఇంటికి రమ్మని ఎన్నోసార్లు ఫోన్ చేసి చెప్పాను. ఇక్కడి కంఫర్ట్ లైఫ్ గురించి ఏకరువు పెట్టేవాడిని. అయినా తనకు అక్కడే స్వేచ్ఛగా ఉంటుందనీ, రాలేనని నిర్ద్వందంగా తిరస్కరించేవారు. రోజు రోజుకి పరిస్థితి అద్వాన్నమవుతోంది.

ఏం చేయాలో పాలుపోవడం లేదు.

ఇప్పటికే ఇంట్లోవున్న బంగారం, ఖరీదయిన వస్తువులు అమ్మి ఎనిమిదినెలలు గడిపేశాం...ఇహ కష్టం.

ఇలాగే అయితే డిప్రెషన్‌లోకి వెళ్లి ఆత్మహత్య చేసుకుంటామేమో అన్న అనుమానం వస్తోంది.

ఏదో ఒకటి చేయాలి... లాభం లేదు.

"స్వప్నా..." పిలిచాను.

నీరసంగా వచ్చింది.

"నేను ఇవాళ బయలుదేరి మా నాన్న దగ్గరకు వెళ్లి వస్తాను. నువ్వూ, పిల్లలూ జాగ్రత్త. మా నాన్న అనుభవం ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తుందని నా నమ్మకం. ఊళ్లో వాళ్లకు ఎన్నోసార్లు సరైన సలహాలు చెప్పడం విన్నాను. నాకు ఇన్నాళ్లు ఆయన గుర్తుకు రాకపోవడమే ఆశ్చర్యంగా వుంది" అన్నాను ఉద్వేగంగా.

నా సంతోషం, స్వరంలో వినిపించేసరికి తనకు కూడా కాస్త జీవం వచ్చినట్టుంది.

"అలాగేనండీ, మనకిప్పుడు కావలసింది పెద్దవాళ్ల సపోర్టే! మా వాళ్లు ఆర్థికంగా అంత ఉన్నవాళ్లు కాదు. మా నాన్నకు అంత లౌకిక జ్ఞానమూ లేదు. మన సమస్యకు పరిష్కారం మీ నాన్న ఇవ్వగలరంటే, ఇప్పుడే, ఇంకాలస్యం చేయకుండా వెళ్లిరండి" అంది తొందరగా బ్యాగ్ సర్ది చేతికిస్తూ.

* * *

నేను కలల ప్రపంచంలోంచి హఠాత్తుగా ఈ లోకంలోకి వచ్చి చూసేసరికి బస్సు పచ్చటి పొలాల మధ్య పరిగెడుతూ మాకు స్వచ్ఛమైన ప్రాణవాయువునిస్తోంది.

ఎప్పుడు లేచాడోగానీ నా పక్క ముసలాయన పేపర్ చదువుతున్నాడు. నిన్న రాత్రి ఆయన పట్ల నాకు కలిగిన ఆలోచనకు నవ్వొచ్చింది.

మా ఊరి బస్టాండ్‌లో దిగగానే వేప్పుల్లలతో పళ్లు తోముకునేవాళ్లు, మోకాళ్ల దాకా నిక్కర్లు వేసుకున్న వాళ్లని చూడగానే మా ఊరు, మా వాళ్ల మధ్యకొచ్చేశానన్న ఏదో తెలియని అనుభూతి మదిని చుట్టేసింది. దూరంగా వున్న చంటి హోటల్ నుంచి వచ్చే ఇడ్లీ ఆవిరి వాసనా, దోశ కాలిన వాసనా కలగాపులగంగా అయినా కమ్మగా నాసికా పుటల్ని సోకాయి. రెండు ఇడ్లీలు తిని కాస్త కాఫీ తాగుదామనుకున్న నేను, స్వప్న పిల్లలూ గుర్తొచ్చి కాళ్లని ఇంటివైపు నడిపించాను. గోదావరి ఒక పాయ మా ఇంటి ముందునుంచీ ఒంపుసొంపులతో ప్రవహిస్తుంది. దాన్ని తాకుతూ సాగే మట్టిరోడ్డు మీద నడవడం నాకు ఎప్పుడూ ఇష్టమే! మధ్య మధ్యలో పెంకులు అందుకుని నీళ్లపై కప్పగంతులేయిస్తూ తాత్కాలికంగా నా సమస్యలు మర్చిపోయి, మానసికంగా మురిసిపోయాను.

ఇంటి ముందుకు చేరేసరికి మా నాన్న వసారాలో కూర్చుని పేపర్ చదువుకుంటున్నాడు.

నేను గేటు తీయగానే ఆ చప్పుడుకు నా వైపు చూసి నాలోని నిస్తేజాన్ని తన అనుభవంతో పరిశీలించి, ఏదో సమస్య నన్ను వేధిస్తోందని గ్రహించి, నా దగ్గరకొచ్చి "మనం తీరిగ్గా తర్వాత మాట్లాడుకుందాం. నువ్వు ముందు ఫ్రెష్ అయి కాసేపు విశ్రాంతి తీసుకో. అప్పటికి నీ మనసులోని అలజడి కాస్త సద్దుమణుగుతుంది" అన్నాడు అనునయంగా.

నేను 'సరే' అన్నట్టుగా ముందుకు కదిలాను. అమ్మ ఎదురొచ్చి "ఏరా, ఇంతగా చిక్కిపోయావు. నువ్వు సంతోషంగా వున్నావనుకున్నాం గానీ ఇలా అయిపోయావేమిట్రా? అవునూ, అమ్మాయిని పిల్లల్ని తేలేదేమిటి?" అంది కళ్ల నీళ్లతో నన్ను నిలువెల్లా అపేక్షగా తడుముతూ.

"అన్నీ చెబుతాడు, ముందు వాడిని ప్రయాణ బడలిక పోగొట్టుకొనీ రాజ్యం" అన్నాడు నాన్న అమ్మతో.

నేను లోపలికెళ్లి స్నానం ముగించి వచ్చేసరికి అమ్మ నాకోసం వేడి వేడిగా చింతపండు పులిహోర సిద్ధం చేసింది. తిన్నాక నిద్రవచ్చింది. మధ్యాహ్నం ఒంటిగంటకు లేచాను. చాలా కాలానికి మాంఛి నిద్ర పట్టింది. అన్నీ మర్చిపోయి హాయిగా నిద్రపోయాను.

నేను లేచేసరికి నాన్న లేడు. "పనిమీద బయటకి వెళ్లారు" అమ్మ చెప్పింది.

కాసేపటి తర్వాత భోజనానికి వచ్చాడు.

మా అమ్మచేసిన పదార్థాలు నా ఆకలిని ద్విగుణీకృతం చేసి చల్లబరచాయి. అమ్మ చేతి వంట అమ్మ చేతివంటే!

తిన్నాక వాయువ్యం వైపున్న విశాలమైన గదిలో కూర్చున్నాం. నేను మధ్యాహ్నం వేసుకోవలసిన అయిదు రకాల టాబ్లెట్లు వేసుకున్నాను.

మెల్లగా ఉద్యోగంలో అకాశ విహారం.. రిసెషన్...ఎనిమిది నెలల నుంచీ మేమెదురుకుంటున్న గడ్డు పరిస్థితి పూసగుచ్చాను.

అన్నీ విన్న ఆయన "ఇందులో బాధ పడడానికి ఏముంది? సుఖదుఃఖాలు చీకటి వెలుగులూ సహజమే! వాటికి బెంబేలెత్తితే ఎలా? నీ ఆలోచనలు, నీ మొన్నటి స్థాయికి తగ్గట్టు ఉన్నాయి కాబట్టే సతమత మవుతున్నావు. 'ఎవరికీ ఏదీ శాశ్వతం కాదు' అన్న ఎరుక కలిగి వుంటే ఇబ్బంది ఉండదు. సృష్టిలో ఏ జీవీ ఆకలితో చచ్చిపోదు. అది ఎక్కడో అక్కడ తన కడుపుకు ఎంత కావాలో అంత సంపాదించు కుంటుంది. మనలాగా దాచుకోవడం కూడా తెలియదు. అయినా బతికినంతకాలం హాయిగా, సుఖంగా బతుకుతుంది. మనమే లేనిపోని భేషజాలకు పోయి తినడానికన్నా విలాసాలకోసం, సౌకర్యాలకోసం నేల విడిచి సాము చేస్తాం. అప్పుడు భంగపాటు తప్పదు. 'కడుపులో చల్ల కదలకుండా' అని మనవాళ్లు ఊరికే అనలేదు. ఎండమావులకోసం పరిగెత్తి చివరకు అలసిపోయి కూలబడి పోవడం తప్ప, ఓ సుఖమా సంతోషమా? నన్ను నువ్వు ఎన్నోసార్లు రమ్మన్నావు, వచ్చానా? లేదు. ఎందుకంటే వస్తే వాటికి

దాసోహం అయ్యే అవకాశం ఉంది. ఇక్కడ పల్లెటూరిలో ఎంతఆనందం ఉంటుందో తెలుసా? అంతెందుకు, నువ్వు నీ శరీరాన్ని అంటిపెట్టుకున్న అనారోగ్యానికి ఎన్ని మందులేసుకున్నావో ఇందాక చూశాను. నాకు ఇంతవరకు తలనొప్పి ఎలా ఉంటుందో తెలియదు. అదీ వ్యత్యాసం. ఏసీ గదులలోనూ, సకల సౌకర్యాలతోను శరీరాన్ని సుఖబెట్టి దాన్ని కష్టపడమంటే ఎందుకు కష్టపడుతుంది? కష్టపడితేనే కదా సుఖం. ఎప్పటికైనా సుఖం నుండి లభించే సుఖం కాదు, కష్టం నుంచి లభించే సుఖమే విలువైనది. 'ఇవన్నీ ముందే చెప్పొచ్చు కదా! ఇప్పుడు చేతులు కాలాక ఎందుకు చెబుతున్నాడు' అని నువ్వనుకోవచ్చు. దేనికైనా సమయం రావాలి. భగవద్గీత ఆవిష్కరణ కురుక్షేత్ర యుద్ధంలోనే జరిగింది. మొదలే చెప్పుంటే నువ్వు నాతో పోట్లాడి మరీ, ఈ ఇంటి గుమ్మం దాటేవాడివి. దాని ఆకర్షణ అలాం టిది. ఇప్పుడు ఈ ఇంటి తలుపు తట్టడానికి సంకోచించేవాడివి. అందుకే అప్పుడు మౌనం వహించాను. ఇప్ప టికైనా మించిపోయింది లేదు. మిమ్మల్ని చూసుకోవడానికి పెద్ద దిక్కు మేమున్నాం. అమ్మాయినీ పిల్లల్నీ కూడా ఇక్కడకు వచ్చే యమను. పసిపిల్లల మీద విషపు ఛాయలు పడనీయకండి. కొన్నాళ్లు కలుషితానికి దూరంగా ఇక్కడి ప్రకృతిలో మమేకమై కాలం గడపండి. మానసికంగా సేదదీరండి. సాంత్వన పొందండి. మనసు ఎప్పుడైతే ప్రశాంతత పొందుతుందో, సరైన ఆలో చనలకు మార్గం సుగమం అవుతుంది. ఆడంబరాలన్నీ మన ఊరి పొలిమేరలో వది లేసేయండి. జీవించడానికి కడుపు నింపుకోవాలి. కడుపు నింపుకోవడం ఇక్కడ కష్టం కాదు. నెమ్మదిగా అన్నీ కుదుట పడ్డాక ఏం చేయాలన్నది ఆలోచిద్దాం" అన్నాడు.

ఊరిలో ప్రతితండ్రీ తన అనుభవంతో తన బిడ్డలకు కౌన్సిలింగ్ ఇవ్వగలడు. సైకియాట్రిస్ట్ కాకుండానే మనసుకు మందేయగలడు. కానీ మనం చదువుకున్నవాళ్లమని విర్రవీగుతూ, పల్లెటూరి వాళ్లు... వాళ్లకేం తెలియదని' తీసిపారేస్తాం. ఆత్మహత్యదాకా ఆలోచించిన మనసుకు, మా నాన్న తన మాటలతో ఊరటనిచ్చారు. 'బ్రతకగలం' అనే భరోసా నిచ్చారు. ఒక్కోసారి సమస్యలో కూరుకుపోయినపుడు మనకు మనంగా పైకి రాలేం. అందులోనే ఉండడంవల్ల దారులన్నీ మూసుకుపోయినట్టు అనిపించి జీవితం అంతం చేసుకోవాలనుకుంటాం. అలాంటి విపత్కర సమయంలో మనకు మరోదారి చూపించి మానసికంగా బలాన్నిచ్చేవాళ్లు కావాలి. సిటిలో అయితే మానసిక వైద్య నిపుణులు ఆ పని చేస్తారు. కానీ ఎంతమంది వాళ్లని ఆశ్రయిస్తారు? అయినా ఇప్పుడంటే అలాంటి అవకాశాలు ఉన్నాయిగాని, ఒకప్పుడు పెద్దవాళ్లే కదా ఆ బాధ్యత నెరవేర్చేది. అందుకే పెద్దవాళ్లు, అనుభవజ్ఞులసలహాలు తీసుకుంటూ ఉండాలి. గతం ఓ పీడకల, దాన్ని వీలైనంత త్వరగా మర్చిపోయి కొత్తజీవితం ప్రారంభించాలి అనుకున్నాక, మళ్లీ మనసులో ఉత్సాహం ఉరకలేయడం మొదలెట్టింది.

సెల్ తీసుకుని స్వప్నకు ఫోన్చేసి రాత్రికి బయల్దేరి ఊరొచ్చేయమన్నాక మనసు పూర్తిగా కుదుటపడింది. నాన్న తనకు ఏదో పనుందని బయటకెళ్లి పోయారు. నేనూ ఊళ్లోకి బయల్దేరాను. రేపట్నుంచి, పిల్లలకు చదువు చెప్పడమో, పొలం పనుల్లో నాన్నకు చేదోడు వాదోడుగా ఉండడమో చెయ్యాలికదా!

# కాలం మీద చెరగని సంతకం

(డా॥ అద్దేపల్లి రామమోహనరావు గారి స్మృతిలో....)

కవిత

బతుకు సూత్రాల్నీ
గతి తప్పుతున్న చలన సూత్రాల్నీ మోస్తూ
ఎందరో పుడుతుంటారు - గిడుతుంటారు
హృదయాలపై చెరగని ముద్రలేస్తూ
అలౌకికమూ - అద్వితీయమూ అయిన
ఒక్క వాక్యాన్నైనా ఇచ్చిన మహానుభావులెందరు...!

నిన్నగాక మొన్ననేగదా
అంతర్వేదిలో మనం ఆలింగించుకున్నదీ
ప్రకృతి రమణీయతకు పులకించి పరవశించినదీ
"ఓకే, ఆల్‌రైట్, అది, అదన్నమాట సంగతీ" అంటూ
మమ్మల్ని ఆనందంలో మునకలేయించిందీ...!

కవిత్వపు దాహంతో అలమటించే
కొత్తస్వరాలకు జవజీవాలిచ్చి
ఎన్నెన్నో హృదయ సంభాషణలు పంచుకొని
"ఈ ధనమంత పోనీ, యవ్వనమంత పోనీ
ఆనాటి బాల్యాన్ని ఒకసారి రానీ" అంటూ
మమ్మల్ని ఆనందడోలికల్లో ఉర్రూతలూగించిందీ...

వింత వింత కబుర్లు చెబుతూ, రసగుళికల్ని పంచుతూ
వయోభారం తెలియని సహృదయుడా...!
పొగచూరిన ఆకాశానికి వెల్ల వేసి
రంగవల్లులద్దే ప్రియబాంధవులతో
ముచ్చట్లు చెబుతూ
బాల్యపు అనుభూతుల్ని పంచుతూ
చేతనా లోకపు కాలం మీద చెరగని సంతకం చేసి
మాటుకాసిన మృత్యు వృక్షమెక్కి మాకు వీడ్కోలు పలికావా...!?

బందరులోనైనా, కాకినాడలోనైనా
సముద్రపు హోరు వినందే నిద్రరానివాడా..!
రహస్య నిద్రేదో ఆవహించి
మిమ్మల్ని మింగిన మృత్యువృక్షానికి
సాహిత్యపు పరిమళాల్ని పంచటానికి
అంత తొందర పడ్డావెందుకు...?

కె.విల్సన్ రావు